


# నల్లగొండ సత్యనిష్ఠ

నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి భువనగిరి

25 శుక్రవారం సెప్టెంబర్ 2026 పేజీలు: 3


## 39 గౌడ, 10 ఎస్సీ కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేసిన వారిని శిక్షించాలి

- **బీసీ కమిషన్ చైర్మన్ జీ.నిరంజన్‌ని కలిసి విజ్ఞప్తి చేసిన జాజుల లింగం గౌడ్**



**నల్లగొండ-సెప్టెంబర్ 24 (సత్య నిష్ఠ):**సభ్య సమాజం తలదించుకునేలా రాకెట్ యుగంలో కూడా ఇంకా గ్రామ అభివృద్ధి కమిటీల (వీడీసీ) పేరుతో గ్రామాలలో ఇంకా బహిష్కరణల కాలం నడుస్తుందని బిసి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం తాళ్ల రాంపూర్ గ్రామానికి చెందిన 39 గౌడ మరియు 10 ఎస్సి కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఈరోజు బీసీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ గారిని కలిసి విజ్ఞప్తి చేసినట్లు లింగం గౌడ్ తెలిపారు. గతంలో కూడా సాక్షాత్తు జిల్లా జడ్జి మరియు పోలీస్ కమిషనర్ వచ్చి చెప్పిన ఆ గ్రామంలో ఉన్నవారు మారకపోవడం దుర్మార్గమని అన్నారు.

## ప్రమాదకర ప్రాంతాల్లో ప్రజల రాకపోకలను అరికట్టాలి

- **పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పటిష్ట చర్యలు చేపట్టాలి**
- **ప్రతి గ్రామ పంచాయతీకి ప్రత్యేకాధికారి.. 24 గంటలూ పర్యవేక్షణ**
- **జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్**



**విఆర్ పురం-సత్యనిష్ఠ**

పోలవరం జిల్లా భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రమాదకర ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సురాపాటి ప్రశాంత్ కుమార్ ఆదేశించారు. గురువారం సాయంత్రం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మండలాల వారీగా వర్షాలు, వరద పరిస్థితులు, ప్రజల భద్రత, సహాయక చర్యలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించిన సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో అధికారుల సూచనలకు అనుగుణంగా రక్షణ చర్యలు అమలు కావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు సూచనలు చేస్తున్నప్పటికీ కొందరు ప్రజలు పోలీస్, రెవెన్యూ శాఖలకు సమాచారం లేకుండా వాగులు, వరద ప్రాంతాలు, చేపల వేట ప్రాంతాలకు వెళ్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఇటువంటి ప్రమాదకర ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా నిరంతరం అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైన చోట్ల కఠినంగా అడ్డుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లే వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ప్రతి గ్రామ పంచాయతీకి ప్రత్యేకాధికారి**

ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ప్రత్యేకాధికారిని నియమించి, వరద ప్రభావిత ప్రాంతాల్లో 24 గంటలూ నిరంతర పర్యవేక్షణ, గస్తీ నిర్వహించేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్లు, ఎంపీడీవోలను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతం**

భారీ వర్షాల కారణంగా మారేడుమిల్లి, వి.ఆర్.పురం తదితర ప్రాంతాల్లో పడిపోయిన విద్యుత్ స్తంభాలు, దెబ్బతిన్న విద్యుత్ తీగల పునరుద్ధరణ పనులను విద్యుత్ శాఖ అధికారులు వేగవంతం చేస్తున్నట్లు టెలికాన్ఫరెన్స్‌లో తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

**ప్రతి రెండు గంటలకు పరిస్థితిపై నివేదికలు**

వర్షాలు పూర్తిగా తగ్గే వరకు జిల్లాలోని ప్రతి మండలంలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పరిస్థితి నివేదికలను సమర్పించాలని, వర్షపాతం, వరద ఉధృతి, ప్రమాదకర ప్రాంతాల్లో పరిస్థితి, ప్రజల తరలింపు, పునరావాస కేంద్రాల వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని స్పష్టం చేశారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

## ఘనంగా జాతీయ సేవా దినోత్సవ వేడుకలు




**కోదాడ – సెప్టెంబర్ 24 (సత్యనిష్ఠ)** నడిగూడెం మండల కేంద్రంలోని కే ఎల్ ఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహాత్మా గాంధీ చిత్రప టానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జాతీయ సేవా దినోత్సవాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని సేవా దృక్పథం తో సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచు కునేందుకు ఎన్ఎస్ఎస్ యూనిట్లు వేదిక గా నిలుస్తాయని జాతీయ సేవా పథకం యూనిట్ 2 అధికారి కర్నాటి శ్రీధర్ అన్నారు. కళాశాల లో ఉన్న రెండు ఎన్ఎస్ఎస్ యూనిట్ల ద్వారా విద్యార్థులు గ్రామాల్లో ప్రజల ను చైతన్యం చేసేందుకు పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు .జాతీయ సేవా పథకం యూనిట్ వన్ అధికారి గుండు నాగరాజు, అధ్యాపకులు కృష్ణ, మహేష్, ఈశ్వర్, శ్రీనివాసరావు, కొల్లు శ్రీనివాస్, ఉపేందర్, వీరన్న, రజిత, సుజాత, మదర్, నగేష్, ధనుంజయ్, మనీ, శైలజ, నాగరాణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదానంతో మరొకరికి కొత్త జీవితం

**ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో డా హరినాథ్**




**నల్లగొండ-సెప్టెంబర్ 24 (సత్యనిష్ఠ):** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఎన్ఎస్-ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆవిర్భావ దినోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యులు హరినాథ్ హాజరై నేత్రదానం అవయవ దానాల ప్రాధాన్యతపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్రదానంతో మరొకరికి క్రొత్త జీవితాన్ని ప్రసాదించవచ్చునని ఈ ఉద్యమంలో విద్యార్థులు పాల్గొని సమాజాన్ని చైతన్య పరచాల్సిందిగా కోరారు. ఎన్ఎస్ఎస్ ద్వారా దేశ సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక అంశాలను పరిశీలించి సేవ కార్యక్రమాలలో నిమగ్నం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా మారం వెంకటరమణారెడ్డి, పి ఓలు డా షరీఫ్, డా విజయ్ కుమార్, శ్రీనివాస్, రమేష్ నాయక్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత సందేశాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి:ఎఫ్‌సీఐ డీఎం సువీన్ కుమార్



**నల్గొండ-సెప్టెంబర్ 24( సత్య నిష్ఠ)** స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని, విద్యార్థులు స్వచ్ఛత సందేశాన్ని తమ కుటుంబాలకు, పరిసర ప్రాంతాలకు తీసుకెళ్లాలని ఎఫ్‌సీఐ నల్గొండ డివిజనల్ మేనేజర్ సువీన్ కుమార్ సూచించారు. స్వచ్ఛతలో భాగస్వామ్యం– స్వచ్ఛ భారత్, వికసిత భారత్‌లి" అనే థీమ్‌తో నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవా--2026లో భాగంగా ఎఫ్‌సీఐ నల్గొండ ఆధ్వర్యంలో గురువారం డైట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, గొల్లగూడ, నల్గొండలో 'స్వచ్ఛతా జ్ఞాన యాత్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం సువీన్ కుమార్ విద్యార్థులతో మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి--పొడి చెత్తగా వేరు చేయడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అలవాట్లను చిన్ననాటి నుంచే అలవరచుకోవాలని సూచించారు. విద్యార్థులు స్వచ్ఛత దూతలుగా మారి పరిశుభ్రత ప్రాముఖ్యతను ఇతరులకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోలె వెంకటయ్య, ఎఫ్‌సీఐ సీనియర్ అధికారులు పవన్, ఆదిమల్ల శంకర్, కాశిరెడ్డి , ధీరజ్, ఉద్యోగులు షాహిద్, ప్రవీణ్, యమున, మమత, దివ్య, కార్యక్రమ నిర్వాహకులు క్రాంతి, అజయ్, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ ఎడమ కాలువ నీటి విడుదల, వర్షం, రైతుల్లో ఆనందం



కోదాడ - సెప్టెంబర్ 24 (సత్యనిష్ఠ) తెలంగాణ రాష్ట్రంలో పలు జిల్లాల తో పాటు, సూర్యాపేట జిల్లా భారీ తుఫాను తో కూడిన వర్షం, ఇటీవల నాగార్జున సాగర్ ఎడమ కాలువ నీటి విడుదల, ఇక పూర్తి భరోసా తో కూడిన అనందం, రైతుల మాటల్లో ఎ ఇద్దరు రైతులు కలిసిన రామాపురం, చాకిరాల సిరిపురం, కాగిత రామ చంద్రపురం, నడిగూడెం, అలాగే లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నడిగూడెం మండల కేంద్రం లో చెరువుల కు నీటి సరఫరా తో పాటు పలు చెరువుల లో ఉదృతంగా వర్షం నీరు రావడం, పలు చెరువుల కు నీరు ప్రవహిస్తుండడం తో వారి మదినిండా అనందమే. అయితే ఈ అనందం ఒక్క రోజు లో వచ్చింది కాదు. కొన్ని నెలలు గా రైతన్న ల ఎదురు చూపు ఈ రోజు సాకరమైంది. వివరాల్లోకి ఒకసారి, గతం సంబందించి చెరువుల ఆయకట్టు క్రింద ఉన్న పంట పోలాల్లో సూర్యాపేట జిల్లా ను వ్యవసాయ అనుకూల పద్ధతుల ద్వారా సస్యశామలం కావాలంటే చెరువుల నీళ్ల ఆసరా అయ్యేది. కొన్ని నెలల తరువాత జరిగిన. అనేక సంఘటనల నేపథ్యం లో అసమయంలో ఎప్పటి నుంచో వర్షం కోసం మరియు పూర్తిస్థాయి నాగార్జునసాగర్ నీటి విడుదల విషయమై అశగా ఎదురు చుస్తున్న, రైతులు, రైతు సంఘాలు అన్ని రాజకీయ పక్షాలు సుదీర్ఘ పోరాటం పలితంగా, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి చొరవ, రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు, రైతులు, రైతు సంఘాలు, రాజకీయ పక్షాలు అనేక సార్లు సమస్య ను ప్రభుత్వం దృష్టి కి తీసుకెళ్ళటం, చివరకు ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకొని నీటి విడుదల చేయటం తో వ్యవసాయ అనుకూల నిర్ణయం సాధ్య మైంది. అంటే ఇది అందరి సమిష్టి కృషి. అందరి విజయం. ఇది ఎ ఒక్కరి విజయం కాదు ప్రభుత్వ సానుకూల నిర్ణయ మే. ఎమ్మెల్యే చొరవ, మంత్రి నిర్ణయం భారీ వర్షం రావడం, రైతుల్లో ఆనందం, సంతోషాల తో పలు గ్రామాల లో రైతులు వ్యవసాయ పనుల లో వరి పొలాల కు నీటిని సరఫరా చేసు కోవటం లో నిమగ్నం అయ్యారని రామాపురం రైతు, ఆదర్శ రైతుల సంఘం మాజీ మండల అధ్యక్షులు, అభ్యుదయ రైతు మారిశెట్టి నరసింహారావు అన్నారు.

## ఎర్రగుంట వాగు వల్ల, గాంధీనగర్‌కు ప్రమాద మేమీ లేదు

### గంధం బాలేంద్ర పాండు 34వ వార్డు కౌన్సిలర్.



కోదాడ సెప్టెంబర్ 24 (సత్యనిష్ఠ) కోదాడ నియోజకవర్గ శాసన సభ్యులు ఉత్తమ్ పద్మావతి రెడ్డి, కోదాడ పట్టణ పురపాలక సంఘం చైర్పర్సన్ ఎర్నేని కుసుమ వెంకరత్నం బాబు, సూచన మేరకు ఈ రోజు 34 వార్డు కౌన్సిలర్ గంధం బాలేంద్ర పాండు ఎర్రగుంట వాగు నుండి పెద్ద చెరువుకు వరద నీరు వెళు తున్నందున స్థానిక గాంధీనగర్ 34 వ వార్డు లో అకాల వర్షం వలన ఎర్రగుంట వాగు లోకి నీరు చేరడం జరిగింది. (సిల్ట్ ) కాలువ పూడిక తీయడం వలన వచ్చిన వరద వచ్చి నట్లే పెద్ద చెరువు లోకి వెళ్ళి పోవడం జరుగుతుంది. 34 వ వార్డుకి ప్రస్తుతం ఎటువంటి వరద ప్రమాదం లేదు, వార్డు కౌన్సిలర్ ఎప్పటికప్పుడు వార్డును పర్యవేక్షిస్తున్నారు.

## ప్రజల ప్రాణాలు గురించి పట్టించుకోని పాలకులు, అధికారులు

- **కెమికల్ పరిశ్రమలను తొలగించే వరకు పోరాడుదాం**
- **సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా**




**భువనగిరి - సెప్టెంబర్ 24 ( సత్య నిష్ఠ)** పాలకులకు, జిల్లా యంత్రాంగానికి కెమికల్ పరిశ్రమల యజమానుల లాభాలు తప్ప, పరిశ్రమల పొల్యూషన్ వల్ల ప్రాణాలు కోల్పోతున్న ప్రజల బతుకులపైన, దెబ్బ తింటున్నా పంట పొలాలపై ఎలాంటి పట్టింపు లేదని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా విమర్శించారు. అంతమ్మగూడెం, దోతిగూడెం గ్రామాల పరిధిలో ఉన్న 11 కెమికల్ పరిశ్రమలు తొలగించే వరకు ఆయా గ్రామాల ప్రజలు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గురువారం పోచంపల్లి మండల పరిధిలోని దోతిగూడెం గ్రామంలో సిపిఎం శాఖ సమావేశం అనంతరం జరిగిన పొల్యూషన్ వ్యతిరేక పోరాట కమిటీ సమావేశంలో నర్సింహ పాల్గొని మాట్లాడుతూ పరిశ్రమలంటే ప్రజలకు ఉపాది కల్పించే విధంగా ఉండాలి కానీ ఈ ప్రాంతంలో ఉన్న కెమికల్ పరిశ్రమలు వ్యవసాయాన్ని దెబ్బ తీస్తూ, ప్రజల ప్రాణాలను కూడా తీస్తున్నాయని విమర్శించారు. ఈ రెండు గ్రామాల పరిధిలో ఉన్న 11 కెమికల్ పరిశ్రమల రసాయన పదార్థాలు, విషవాయువులు భూగర్భ జలాల్లో కలిసి నీరు మొత్తం కలుషితమై పంటలు, పంట పొలాలు దెబ్బతింటున్నాయని, పండిన పంటలు కూరగాయలు కూడా విషముగా మారుతున్నాయని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కెమికల్స్ నిల్వ చేయడం, రక్షణ చర్యలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగి కార్మికులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, స్థానిక ప్రజలు ఊపిరి ఆడక పోవడం, ఆ విష వాయు కాలుష్యం వల్ల అనేక రకాలైన జబ్బులకు గురవుతున్నారని తెలిపారు. కాలుష్యాన్ని అరికట్టవలసిన కాలుష్య నియంత్రణ మండలి పూర్తిగా విఫలమైందని కంపెనీ యజమానులతో కుమ్మక్కై పొల్యూషన్ ఎంత పరిశ్రమల నుండి వస్తుంది తెలుసుకునే యంత్రాలను కూడా పెట్టించే పరిస్థితిలో పీసీబీ జిల్లా అధికారి లేదని విమర్శించారు. జిల్లా కలెక్టర్, ఆర్డిఓ, స్థానిక శాసనసభ్యులు పరిశ్రమలలో ప్రమాదాలు జరిగినప్పుడు, రాన నష్టం జరిగినప్పుడు వచ్చి హడావుడి చేయడము తప్ప శాశ్వతమైన పరిష్కారం చూపడం లేదని, పరిశ్రమలవల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించే పరిస్థితులు లేరని విమర్శించారు. ఈ ప్రాంత ప్రజల బతుకులు బాగుండాలంటే, వ్యవసాయము భూములు దక్కావాలంటే పరిశ్రమలను ఈ ప్రాంతం నుండి తోలగించాలని డిమాండ్ చేసినారు. కెమికల్ పరిశ్రమలు తొలగించే వరకు ప్రజలు ఐక్యంగా పోరాడాలని, ఈ పోరాటంలో సిపిఎం ముందు వరసన ఉంటుందని నర్సింహ తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి కోట రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు తీస్తున్న, జల మరియు వాయు కాలుష్యానికి కారణమౌతున్న కెమికల్ పరిశ్రమలను వెంటనే తోలగించాలి, రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, నష్టపోయిన రైతులను గుర్తించడానికి రి సర్వే చేయాలని, ప్రభుత్వం నియమించిన కమిటీలో కాలుష్యానికి గురవుతున్న ప్రజలకు అవకాశం కల్పించాలని కోరుతూ అక్టోబర్ 1వ తేదీన దోతి గూడెం, అంతమ్మగూడం గ్రామాల నుండి చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం వరకు వందలాదిమందితో నిర్వహిస్తున్న " పాదయాత్ర " అనంతరం జరిగే " మహా ధర్నా" లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు ప్రసాదం విష్ణు అధ్యక్షత వహించగా సిపిఎం మాజీ మండల కార్యదర్శి పగిళ్ల లింగారెడ్డి, మండల కార్యదర్శివర్గ సభ్యులు మంచాల మధు, మండల కమిటి సభ్యులు కలుకూరి బిక్షపతి, పార్టీ సభ్యులు, ఆయా గ్రామాల సంబంధించిన రైతులు గుర్రం రామచంద్రారెడ్డి, ముద్దం సత్తయ్య, యాస మల్లారెడ్డి, గూని మల్లయ్య, గుమ్మి దామోదర్ రెడ్డి, రావుల రాంరెడ్డి, కడెం మహేష్, రావుల బాల్ రెడ్డి, వస్పరి శ్రీశైలం, అర్ల నరసింహ, వస్పరి అంజమ్మ , వస్పరి కలమ్మ, భారతమ్మ, పూజిత, జయమ్మ, రావుల ధనలక్ష్మి, కమలమ్మ, సత్తిరెడ్డి, వనమ్మ, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## గౌడ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా వంగూరి పాపన్న గౌడ్

**హైదరాబాద్-సెప్టెంబర్ 24 ( సత్య నిష్ఠ)** తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులుగా వంగూరి పాపన్న గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం కేంద్ర కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షులు లిగట్టు రామచంద్రయ్యా గౌడ్ చేతుల మీదుగా పాపన్న గౌడ్ నియామక పత్రాన్ని అందుకున్నారు. నియామక పత్రం అందుకున్న అనంతరం పాపన్న గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, గౌడ జాతి అభ్యున్నతి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గౌడ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు



కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే గౌడ యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, సామాజికంగా మరియు ఆర్థికంగా గౌడ సమాజం అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని పాపన్న గౌడ్ తెలిపారు. తనకు జిల్లా ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించిన తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు గట్టు రామచంద్రయ్య గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు గుండాల మల్లేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు.